క్లుప్తంగా

జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



పిట్లం(జుక్కల్): ప్రభుత్వం వెంటనే జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే డిమాండ్ చేశారు. ఆయన గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలు కురుస్తున్నందున జొన్న రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సకాలంలో రైతుల వద్ద నుండి కందులు, పెసరులు, శనగలు, జొన్నలు కొనుగోలు చేశామని గుర్తు చేశారు. మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ కవిత, విజయ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఎంఈవోగా రాజులు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎంఈవోగా లింగాపురం రాజులును నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి రాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లారెడ్డి ఎంఈవోగా విధులను నిర్వర్తించిన వెంకటేశం గత నెల 31న పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో గండిమాసానిపేట జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజులును ఎంఈవోగా నియమించారు. నూతన ఎంఈవో రాజులుకు ఉపాధ్యాయ వర్గాలు అభినందనలు తెలిపాయి.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి



బాన్సువాడ రూరల్: ఈనెల 14న బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని బోర్లం గ్రామంలో యువకులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు నల్లోళ్ళ సాయిలు కోరారు. గురువారం బోర్లం గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, డ్రాయింగ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. యువకులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో మన్నె విఠల్, రాజారాం, మన్నె అనిల్, సాయిలు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామంలో గురువారం ఉపాధిహామీ పథకంలో భాగంగా మంజూరైన నిధులతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. 2వ వార్డులో రూ.4లక్షల నిధులతో సీసీరోడ్డు వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి తెలిపారు. నాయకులు కాసుల రోహిత్, మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గంగారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంస



కామారెడ్డి అర్బన్: ఎన్‌సీసీ విద్యార్థులు ఆర్మీ ఎంపికల్లో జాతీయ స్థాయి ప్రతిభ కనబరుస్తున్నారని 12వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి విష్ణు పి.నాయర్ అన్నారు. గురువారం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ విభాగాన్ని విష్ణు పి.నాయర్ సందర్శించారు. కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు మెరుగైన ప్రతిభ చూపిస్తున్నందుకు కమాండింగ్ అధికారి ప్రశంసించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి ఏ.సుధాకర్, విద్యార్థులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అచ్చాయపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల గురించి జీపీ కార్యదర్శి వెంకట్‌రాములును అడిగి ఆయన తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని ఆయన సూచించారు.

అసౌకర్యాల మధ్య ఉపాధి పనులు

- వేసవిలో కూలీలకు తప్పని తిప్పలు
- నీడ,తాగు నీరు లేక ఇబ్బందులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): వేసవిలో ఎండలు ముదురుతున్నాయి. ఉపాధి హామీ పనులు చేసే చోట సేద తీరడానికి నీడ, తాగడానికి నీరు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు అనుకోని గాయాలైతే ప్రథమ చికిత్స అందించడానికి కిట్లు సైతం అందుబాటులో లేవు.

ఉపాధి కూలీలకు కల్పించాల్సిన సౌకర్యాలు

ఉపాధి హామీ కూలీలకు ప్రతి ఏడాది వేసవిలో ప్రయాణ ఖర్చు, గడ్డపారకు రూ.10, తట్టకు రూ.5, మంచి నీటికి రూ.5, 5కి.మీల దూరం నుంచి వచ్చే వారికి రూ.20 చొప్పున అందించేవారు. వీటితో పాటు పని ప్రదేశంలో నీడ సౌకర్యం కల్పించి, విశ్రాంతి తీసుకునేలా చూసేవారు. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం వీటన్నింటిని నిలిపేయడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో ఎక్కువ సేపు పని చేయడం ద్వారా కూలీలు డీహైడ్రేషన్ బారినపడే అవకాశముంది.



నస్రుల్లాబాద్‌లో ఉపాధి హామీపనులు చేస్తున్న కూలీలు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు మధ్యాహ్నం 11గంటల నుండి 3గంటల వరకు పని చేయడం మానుకోవాలి. ఉదయం,సాయంత్రం పని చేయడం మంచిది
- పని మధ్యలో చిన్న విరామం తీసుకోవాలి. అలసిపోయినట్లు అనిపిస్తే నీడబాటున కూర్చోవాలి.
- ఉప్పు,చక్కెర కలిపిన ఆహారం, పండ్లు తీసుకోవడం ద్వారా శరీరంలో శక్తి లవణాల నిల్వలు పెరుగుతాయి.
- ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తగినంత నీరు తాగాలి. శరీరం డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి. పని ప్రదేశంలో ఓఆర్ఎస్, నిమ్మరసం ఉండేలా జాగ్రత్తలు పాటించాలి.
- పని ప్రదేశానికి సమీపంలోని వైద్య కేంద్రం వివరాలు కలిగి ఉండాలి.

పెరిగిన ఉపాధి కూలీ..

ఉపాధి హామీ కూలీ పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రూ.300 చెల్లించేది. రూ.7 పెంచడంతో ఏప్రిల్ నుంచి ఉపాధి హామీ కూలి రూ.307 కు పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,77,487 జాబ్ కార్డు కుటుంబాలలో 5,58,210 మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలి రూ.28 లను పెంచింది.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

ఉపాధి హామీ కూలీలకు పని జరిగే చోట ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసేలా సిబ్బందిని ఆదేశిస్తా. నీడ, నీరు, ప్రథమ చికిత్స కిట్లు ఉండేలా చూడాల్సి ఉంటుంది. కనీస సౌకర్యాల కల్పనలో సిబ్బంది ఆలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటాం.
– సూర్యకాంత్, ఎంపీడీవో

సౌకర్యాలను కల్పించాలి



వేసవిలో ఉపాధి కూలీలకు సౌకర్యాలను కల్పించాలి. పని చేస్తున్నప్పుడు మెడికల్ కిట్‌లు ఉండటం లేదు. నీడ లేక పోవడంతో ఎండలోనే కూర్చుంటున్నాం.
– గణేశ్, మైలారం, ఉపాధి కూలీ

నీళ్లు తెచ్చుకుంటున్నాం..



ఉపాధి హామీ పని వద్ద తాగడానికి నీరు లేక పోవడంతో ఇంటి నుంచి తీసుకెళ్తున్నాం. అధికారులు తాగు నీటి వసతి కల్పించాలి. పని జరిగే చోట ఎండలు తీవ్రంగా ఉంటున్నాయి.
– గంగారాం, మైలారం, ఉపాధి కూలీ

ఉపాధి కూలి పెంచాలి



పని చేస్తున్నప్పుడు ప్రమాదం జరిగి గాయాలైతే వెంటనే చికిత్స చేసుకోవడానికి కిట్లు లేవు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. ఉపాధి హామీ కూలి మరింత పెంచితే కూలీల సంఖ్య పెరుగుతుంది.
– సాయిలు, మైలారం, ఉపాధి కూలి

ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలి



బ్రాహ్మణపల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పెద్ద శక్కర్గాలో పాదయాత్ర చేస్తున్న నాయకులు

మద్నూర్/తాడ్వాయి : రాజ్యాంగ విరుద్ధంగా చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు అన్నారు. మండలంలోని చిన్న శక్కర్గా, పెద్ద శక్కర్గా, సలాబత్‌పూర్, హండెకేలూర్ గ్రామాలలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర చేపట్టారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదం ప్రతి ఇంటికి చేరే విధంగా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి, కాలోజీవాడి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి



బాన్సువాడలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నేతలు



కామారెడ్డి కలెక్టరేట్‌లో..

భిక్కనూరు/బాన్సువాడ/నాగిరెడ్డిపేట/కామారెడ్డి రూరల్/కామారెడ్డి క్రైం : దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని కురుమ సంఘం ప్రతినిధులు అన్నారు. భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో, బాన్సువాడలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో, గోపాల్‌పేటలో కురమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో, కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో దొడ్డి కొమురయ్య జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కొమురయ్య విగ్రహానికి, చిత్రపటానికి నివాళులు అర్పించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీపోటీలు



సంగోజీపేట్‌లో తలపడుతున్న మల్లయోధులు

బాన్సువాడ రూరల్: మండలంలోని సంగోజీపేట్ గ్రామంలో గురువారం నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. బాన్సువాడ మండలంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చిన మల్లయోధులు తమ ప్రతిభను చాటి నగదు బహుమతులు అందుకున్నారు. బాన్సువాడ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉగాది మహోత్సవాల్లో భాగంగా గ్రామదేవతల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా జాతర మహోత్సవం నిర్వహించారు. చివరి కుస్తీలో గెలిచిన వారికి గ్రామానికి చెందిన యువకుడు మంద సంగమేశ్వర్ 5తులాల వెండి కడియాలు బహూకరించారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు, కులపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలను వెంటనే పరిశీలించాలి



మద్నూర్(జుక్కల్): ధరణిలో భూ సమస్యలపై వచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సబ్‌కలెక్టర్ కిరణ్మయి ధరణి, రేషన్ కార్డులు, మీ సేవా సర్టిఫికెట్‌లు, ఇతర సమస్యలపై రివ్యూ నిర్వహించారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో కురుస్తున్న ఆకాల వర్షంతో ధాన్యంపై రైతులకు జాగ్రత్తలు సూచించాలన్నారు. రేషన్ కార్డులలో పేర్ల మార్పులు చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను విచారించాలని ఆమె రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ ముజీబ్ ఉన్నారు.

నాగన్నగారి బావిలో పూడిక తీత పనులు ప్రారంభం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావిలో గురువారం పూడిక తీత పనులు ప్రారంభించారు. గత కొద్ది రోజులుగా ఎండలు తీవ్ర కావడంతో నాగన్నగారి బావిలో నీరు అడుగంటిపోయింది. దీంతో బుధవారం డీఆర్‌డీవో బావిని సందర్శించి పూడిక తీయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలతో పూడిక తీత పనులు ప్రారంభించారు. పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో మలహరి, కార్యదర్శి శ్రవణ్‌కుమార్, ఏపీవో నరేందర్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో కంటి శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి శిబిరంలో ఆప్తాల్మిక్ వైద్యులు డాక్టర్ హరికిషన్ 47 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి



గోర్గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి



మద్నూర్‌లో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సౌజన్య

నిజాంసాగర్(జుక్కల్): కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను రైతులు పొందాలని అచ్చంపేట సొసైటీ చైర్మన్ కయ్యం. నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండలం లోని గోర్గల్, నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి నాయకులు దుర్గారెడ్డి, మోహన్‌రెడ్డి, రామాగౌడ్, గైని. విఠల్, జగన్, విఠల్‌గౌడ్, దుర్గయ్య సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మద్నూర్(జుక్కల్): పొద్దుతిరుగుడు పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సౌజన్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో గురువారం పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మార్కెట్‌కు వచ్చిన పొద్దుతిరుగుడు పంటకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్వింటాల్ కు రూ.7280 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సాయిలు, సింగిల్‌విండో చైర్మన్ శీనుపటేల్, ఏవో రాజు, నాయకులు హన్మండ్లుస్వామి, రాంపటేల్, ప్రజ్ఞకుమార్, గోపి, రాజు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డిపేటలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



లింగారెడ్డిపేటలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత



క్యాసంపల్లిలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట రేషన్ దుకాణంలో ఏఎంసీ చైర్ పర్సన్ రజిత, ఆర్డీవో ప్రభాకర్‌లు గురువారం సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేష్, రేషన్ డీలర్లు తదితరులున్నారు.

పేదల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

కామారెడ్డి రూరల్: నిరుపేదల కడుపు నింపడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మ మోహన్‌రెడ్డిలు అన్నారు. గురువారం కామారెడ్డి మండలం క్యాసంపల్లి, శాబ్దిపూర్ గ్రామాల్లో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల మాజీ వైస్ ఎంపీపీ నరేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ధర్మగొని రాజాగౌడ్, చిదుర భూపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొలిమి భీంరెడ్డి, సందిరి నారాయణరెడ్డి, రాజిరెడ్డి, భూమని బాల్‌రాజు, పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

హనుమాన్ ఆలయానికి రూ. లక్ష విరాళం



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లి గ్రామంలో అంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ రూ.లక్ష నగదును విరాళంగా అందజేశా రు. గ్రామంలోని బాపన్‌పల్లి గ్రామ హనుమాన్ ఆలయం పున:నిర్మాణం చేపడుతున్నారు. ఈ మేరకు మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ను గ్రామస్తులు కలిశారు. తనవంతుగా రూ.లక్ష విరాళాన్ని మాజీ ఎంపీ మనుమడు అక్షయ్ పటేల్ చేతుల మీదుగా ఆలయ నిర్వాహకులు అందుకున్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రాజు, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, విఠల్ తదితరులున్నారు.

సాయి ఆలయంలో భక్తుల పూజలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని నెమ్లి శ్రీషిర్డి సాయి ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కాగడ హారతి,మధ్యాహం అన్నదానం, సాయంత్రం పల్లకీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

దేవాలయం కోడే దూడలకు ట్రాక్టర్ గడ్డి విరాళం

భిక్కనూరు : శ్రీసిద్ధరామేశ్వరాలయంలోని కోడే దూడల కోసం సిద్ధరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన గంధం అశోక్ అనే రైతు ట్రాక్టర్ గడ్డిని గురువారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆలయంలోని కోడే దూడల కోసం గడ్డిని విరాళంగా అందజేయాలని కోరారు.

5న సామూహిక హనుమత్ పడిపూజ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని బ్రహ్మణపల్లి అంజనాద్రి ఆలయం వద్ద ఈ నెల 5న శనివారం రోజున సామూహిక హనుమాత్ పడిపూజ నిర్వహిస్తున్నట్లు అంజనాద్రి ఆలయ కర్త పట్లోళ్ల. కిషోర్ కుమార్ తెలిపారు. పడిపూజకు భక్తులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు.

6 నుంచి సీతారామ కల్యాణ ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి రైల్వే స్టేషన్ శ్రీసీతారామ కల్యాణ నవరాత్రి ఉత్సవాలు ఈనెల 6 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు యెల్లంకి సుదర్శన్, పబ్బ జగన్నాథం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నిత్య పూజలతో పాటు సాయంత్రం భగవద్గీత పారాయణం, భజనలు, పురాణ, హరికథా, బుర్రకథ, సాంస్కృతిక భరతనాట్య ప్రదర్శనలుంటాయని భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో సీఎం దిష్టి బొమ్మ దహనం



జిల్లా కేంద్రంలో సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు



పెద్దకొడప్‌గల్ గాంధీ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్/బాన్సువాడ/పెద్దకొడప్‌గల్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని సీపీఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల వేలం పాట ప్రక్రియ వెంటనే నిలిపివేయాలని పెద్దకొడప్‌గల్‌లోని గాంధీ చౌరస్తాలో బీజేపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. హెచ్‌సీయూ భూములను వేలం వేయవద్దని విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా బాన్సువాడ బీజేపీ నాయకులు హైదరాబాద్‌కు వెళ్తుండగా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం శోచనీయమన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఆర్ట్స్ కళాశాలలో ఫ్రెషర్స్ అండ్ ఫేర్‌వెల్

కామారెడ్డి అర్బన్ : జీవితంలో కష్టాలు వచ్చినపుడు పరిష్కారం దిశగా ఆలోచించాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అన్నారు. ప్రణాళికబద్ధంగా ఉండి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. గురువారం కళాశాల ఫ్రెషర్స్ అండ్ ఫేర్‌వెల్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అంబేడ్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక

బాన్సువాడ : బాన్సువాడ పట్టణ అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నక్క విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లూరి సాయిలు, ఉపాధ్యక్షుడిగా బిట్ల విశ్వనాథ్, మేకల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా దోన్కంటి ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా నక్క సుధీర్ లను ఎన్నుకున్నారు.

లింగంపేట కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ కార్యవర్గం..

లింగంపేట: మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. మైనారిటీ సెల్ అధ్యక్షుడుగా అఫ్రోజ్, ఉపాధ్యక్షుడు సలీం, ప్రధాన కార్యదర్శి మదర్ పాష, సహాయ కార్యదర్శి సద్దాం, సలహాదారుడుగా ఖదీర్‌లను ఎన్నుకున్నారు. అలాగే పట్టణ అధ్యక్షుడుగా ఇర్ఫాన్, ఉపాధ్యక్షుడు ఫయాజ్, ప్రధాన కార్యదర్శి రియాజ్, సహాయ కార్యదర్శి ఫేరోజ్, సలహాదారుడు మజీద్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను ఘనంగా సన్మానించారు.

నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామ సంఘాలకు మంజూరైన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని ఏపీఎం శ్రీనివాస్ సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో గ్రామ సంఘాల మహిళలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణపై అవగాహన కల్పించారు. కొనుగోలు కేంద్రాలకు స్థలం గుర్తించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసి రైతుల వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఈపీ, ఏపీఎం రాజేందర్, ఆయా గ్రామ సంఘాల అధ్యక్షులు, సీసీలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు డిస్పెన్సర్ల విరాళం

కామారెడ్డి అర్బన్: రామేశ్వరపల్లి ప్రభుత్వ ఉపాధ్యాయుడు తుమ్మ సన్నీకుమార్ గ్రంథాలయ పాఠకుల కోసం మూడు వాటర్ డిస్పెన్సర్లను విరాళంగా అందజేశారు. గురువారం జిల్లాలోని తాడ్వాయి, ఎల్లారెడ్డి, కామారెడ్డి గ్రంథాలయాల కోసం 25వేల విలువైన మూడు డిస్పెన్సర్లను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డికి అందజేశారు. దాత సన్నీకుమార్‌ను చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి జ్ఞాపిక అందజేసి సన్మానం చేశారు.

బీఎస్ఎన్ఎల్‌తో వినియోగదారుల పరేషాన్

మద్నూర్(జుక్కల్): మూడు రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్నూర్, డోంగ్లీ మండలాల్లో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ లేక బ్రాండ్ బ్యాండ్, సెల్‌ఫోన్‌లు మూతబడ్డాయి. ఇంటర్‌నెట్‌తోనే అన్ని రకాల పనులు జరుగుతున్న నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ లేకపోవడంతో బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డు ఉపయోగించేవారు, బ్రాడ్ బ్యాండ్ వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.